క్లుప్తంగా

వంతెన నిర్మించాలని వినతి



ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాబాద్: మండలంలోని బొబ్బిలిగామ గ్రామానికి వంతెన నిర్మించాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి శనివారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. బొబ్బిలిగామ గ్రామానికి వంతెన లేకపోవడంతో ప్రజలు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వరద వచ్చినప్పుడు రాకపోకలు నిలిచిపోతున్నాయని వివరించారు. స్పందించిన ఎంపీ వెంటనే గ్రామానికి వంతెన ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ నిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మండల ఎన్నికల ఇన్‌చార్జి ప్రభాకర్ రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణయ్య, ప్రధాన కార్యదర్శి హరీశ్, శక్తికేంద్ర ఇన్‌చార్జి గంధం రమేశ్, నాయకులు తదితరులు ఉన్నారు.

క్రిస్టియన్ శ్మశానవాటికకు స్థలం ఇవ్వొద్దు

కొత్తూరు: మండలంలోని కొడిచర్లతండా సమీపంలో సర్వే నంబర్ 198లో ఉన్న ప్రభుత్వ భూమిలో క్రిస్టియన్ శ్మశానవాటిక, కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇవ్వొద్దని కోరుతూ ఆ తండావాసులు శనివారం తహసీల్దార్, ఆర్డీఓ, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్మశానవాటిక, ఇతర భవనాలకు స్థలం కేటాయిస్తే.. తమతండా ప్రజలు భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. గతంలోనే పలుమార్లు ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఎలాంటి స్పందన లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గతంలో క్రిస్టియన్ కమ్యూనిటీకి స్థానికంగా స్థలం కేటాయించొద్దని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవీందర్‌రెడ్డి, రాములునాయక్, వెంకట్‌నాయక్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

షాబాద్: పార్టీలకతీతంగా రైతులంతా ఏకతాటిపైకి వస్తేనే సమస్యలు పరిష్కారమవుతాయని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడిగే గజేందర్‌గౌడ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కేశవగూడలో జరిగిన బలరామ జయంతి రైతు దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులను విద్యుత్, రెవెన్యూ, మార్కెటింగ్ సమస్యలు వేధిస్తున్నట్లు తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించేందుకు భారతీయ కిసాన్ సంఘ్ కృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. చట్ట ప్రకారం జరగాల్సిన అనేక పనులను విద్యుత్‌శాఖ అధికారులు సకాలంలో నిర్వహించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఆరోపించారు. రైతులు పండించిన పంటలను మార్కెట్‌లో అమ్ముకునేందుకు సైతం అనేక అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా కార్యవర్గ సభ్యుడు సత్యానారాయణరెడ్డి, కార్యవర్గ సభ్యులు వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, ఒగ్గు మల్లయ్య, రాజు, రైతులు తదితరులు ఉన్నారు.

దేశ భాషలందు తెలుగు లెస్స

ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె

షాద్‌నగర్‌రూరల్: దేశభాషలందు తెలుగు లెస్స అని ప్రిన్సిపాల్ డాక్టర్ నీతాపోలె అన్నారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని శనివారం పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న గిరిజన గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో డాక్టర్ నీతాపోలె ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. కన్నతల్లిలాంటి తెలుగు భాషను మరువకూడదన్నారు. ప్రతీ విద్యార్థి మాతృభాషపై మమకారాన్ని పెంచుకొని పట్టు సాధించాలని సూచించారు. అనంతరం తెలుగు అధ్యాపకులు రమణమ్మ, రాజేశ్వరీ మాట్లాడుతూ.. తెలుగుభాష అభివృద్ధికి గిడుగురామమూర్తి చేసిన సేవలు మరువలేనివన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలుగు అధ్యాపకురాలు పావని, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుడికి చెక్కు అందజేత

కేశంపేట: మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్ నిర్మించుకున్న లబ్ధిదారుడికి చెక్కు మంజూరైంది. శనివారం గ్రామ మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి లబ్ధిదారుడు హన్మంత్‌కు రూ.63వేల చెక్కును అందజేశారు. రైతులు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ అబ్బి సుందరయ్య, రాఘవేందర్, తాండ్ర కృష్ణారెడ్డి, కుమ్మరి శేఖర్, శంకర్, కందాడ యాదయ్య, కటికె శేఖర్, శంకర్, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: పూజల్లో పాల్గొన్న మహిళలు, చిన్నారులు



షాబాద్: తిర్మలాపూర్‌లో..

బొజ్జగణపయ్యా.. విఘ్నాలు తీర్చయ్యా

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శనివారం అన్ని గ్రామాల్లో వాడవాడలా వివిధ రూపాల్లో కొలువుదీరిన బొజ్జగణపయ్యకు భక్తులు, ఉత్సవ సభ్యులు వివిధ పత్రాలు, పూలు సమర్పించి ఘనంగా పూజలు చేశారు. ఉండ్రాళ్లు, వివిధ రకాల పిండి వంటలను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి బొజ్జగణపయ్యా.. విఘ్నాలు తీర్చయ్యా అంటూ వేడుకున్నారు. పలు మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.



షాద్‌నగర్: రతన్ కాలనీలో అన్నదాన కార్యక్రమం



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో..



మొయినాబాద్‌రూరల్: పూజలో పాల్గొన్న టీపీసీసీ అధికార ప్రతినిధి సతీశ్, నాయకులు

టీచర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: ప్రభుత్వం కొత్తగా ప్రారంభించనున్న ప్రీప్రైమరీ తరగతుల నిర్వహణకు మండలంలోని మూడు గ్రామాల్లోని పాఠశాలలను ఎంపిక చేసిందని, ఇందులో పనిచేసేందుకు టీచర్లు, ఆయాల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎల్. పురన్‌దాస్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలంలోని దుద్దాగులోని ప్రాథమిక పాఠశాల, కుమ్మెరలోని ప్రాథమికోన్నత పాఠశాల, చేవెళ్లలోని ప్రాథమిక బాలికల పాఠశాలలు ప్రీప్రైమరీ తరగతులకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పాఠశాలల్లో పనిచేసేందుకు ఒక్కో పాఠశాలలో ఒక టీచర్ ఇంటర్ అర్హత కలిగి ఉండాలని, ఒక ఆయా 7వ తరగతి అర్హత కలిగినవారు అర్హులన్నారు. సెప్టెంబర్ 6వ తేదీవరకు అర్హత కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఎమ్మార్సీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో దరఖాస్తుల ఆహ్వానం

మొయినాబాద్: మండలంలోని శ్రీరాంనగర్, నాగిరెడ్డిగూడ, కేతిరెడ్డిపల్లి, తోల్‌కట్ట, పెద్దమంగళారం, వీరన్నపేట ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీప్రైమరీ తరగతులు నిర్వహించేందుకు ఎంపిక చేశారని ఎంఈఓ మల్లయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా పాఠశాలల్లో పనిచేసేందుకు అర్హులైన స్థానిక మహిళలు టీచర్, ఆయాల పోస్టులకు సెప్టెంబర్ 6 వరకు మండల విద్యాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9246212488 సెల్ నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

సెప్టెంబర్ 6 వరకు దరఖాస్తు చేసుకోండి

కొత్తూరు: మండలంలోని మక్తగూడ, సిద్ధాపూర్ గ్రామాల్లో రెండుచోట్ల ప్రీప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈఓ అంగూర్‌నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నాలుగేళ్లు నిండిన చిన్నారులను పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. కాగా వీరి చదువు కోసం ఇంటర్ చదివిన స్థానిక మహిళలు(టీచర్లు), 7వ తరగతి చదివిన వారిని ఆయాలను నియమించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీలోగా ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు.

నిమజ్జనం ఏర్పాట్ల పరిశీలన

షాబాద్: వినాయక నిమజ్జనం కోసం పహిల్వాన్ చెరువు వద్ద ఏర్పాట్లు చేసినట్లు సీఐ కాంతారెడ్డి, ఎంపీడీఓ అపర్ణ తెలిపారు. శనివారం షాబాద్ పహిల్వాన్ చెరువును ఎస్ఐ సతీశ్‌కుమార్‌తో కలిసి వారు పరిశీలించారు. చెరువులోకి విగ్రహాలు వచ్చే రహదారి, ఇతర ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని తెలిపారు. చెరువు వద్ద లైటింగ్ వేయాలని విద్యుత్ ఏఈ కోటేశ్వర్‌రావుకు సూచించారు. నిమజ్జనానికి క్రేన్ ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.



చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ కాంతారెడ్డి, ఎంపీడీఓ అపర్ణ

తప్పుల తడకగా ఓటరు జాబితా



ఎంపీడీఓ హిమబిందుకు వినతిపత్రం అందిస్తున్న ముడిమ్యాల బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు



ముడిమ్యాలలో గ్రామానికి సంబంధం లేని వ్యక్తి ఓటరుగా జాబితాలో నమోదు

- ముడిమ్యాలలో డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్ల నమోదుపై అభ్యంతరాలు
- అధికారుల నిర్లక్ష్యంపై మండిపాటు
- ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓలకు నాయకులు, గ్రామస్తుల ఫిర్యాదు

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన ముసాయిదా ఓటరు జాబితాలలో తప్పులతో గందరగోళం నెలకొంది. ఏ గ్రామంలో చూసినా ఓటరు జాబితాల్లో పేర్ల తప్పులు, డబుల్ ఓట్ల నమోదుపై మండలంలోని గ్రామాల్లో జోరుగా రచ్చ కొనసాగుతోంది. శనివారం మండలంలోని ముడిమ్యాలలో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు వార్డుల వారీగా దాదాపు వంద మందికిపైగా తప్పుడు ఓట్లు నమోదు అయ్యాయని ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో మూకుమ్మడిగా వచ్చి ఫిర్యాదు చేసి ఆందోళన వ్యక్తం చేశారు. ఓటరు జాబితా తప్పుల తడకగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకే ఇంటి నంబర్‌పై పదుల సంఖ్యలో ఓటర్లుగా నమోదు, ప్లాట్ నంబర్లు, సర్వే నంబర్ల ఆధారంగా కూడా ఓటర్ల నమోదు చేయటం ఏమిటీ అని ప్రశ్నించారు. ఒకే వ్యక్తి ఒకేచోట మూడు సార్లు ఓటరుగా నమోదు కావటం కూడా కనిపించ లేకపోవటంపై ఓటరు జాబితా తీరుకు నిదర్శనంగా నిలుస్తోందని మండిపడ్డారు. ఎవరి ప్రయోజనాల కోసం అధికారులు ఇలా ఓట్లు నమోదు చేశారో అర్థం కావటం లేదన్నారు. ఒక్క ముడిమ్యాల గ్రామంలోనే వంద ఓట్లు సంబంధం లేని వ్యక్తులవి నమోదు చేయించారంటే మండలంలో ఏఏ గ్రామంలో ఇలా అధికార పార్టీ వారి హస్తం ఉందో అర్థం కావటం లేదన్నారు. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వెంటనే ఈ ఓట్లను తొలగించాలని లేదంటే అధికారులే స్వయంగా గ్రామానికి వచ్చి ఈ ఓటర్లు ఉంటున్నారా లేదా దానిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ముడిమ్యాల బీఆర్‌ఎస్ నాయకులు గోనే కరుణాకార్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రమేశ్, మాధవ్‌రెడ్డి, రాజు, బీజేపీ నాయకులు దర్శన్, వెంకటేశ్, గ్రామస్తులు కలిసి వార్డుల వారీగా తప్పుడు ఓటర్లు, పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలను అధికారులకు లిఖితపూర్వకంగా సమర్పించినట్లు తెలిపారు. దీనిపై స్పందించకపోతే జిల్లా కలెక్టర్, డీపీఓలకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ తప్పుడు ఓట్లతో ఎన్నికల సమయంలో గ్రామాల్లో పార్టీల మధ్య ఘర్షణ వాతవారణం నెలకొనే అవకాశాలు ఉన్నాయని.. ముందుగానే అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై పోలీసు అధికారులకు సైతం ఫిర్యాదు చేస్తామని చెప్పారు. దీనిపై మండల అధికారులు తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీఓ హిమబిందు స్పందిస్తూ.. తప్పుడు ఓట్ల తొలగింపునకు సంబంధించి ఫాం 7ను నింపి ఇస్తే పరిశీలన చేసి తొలగిస్తామని చెప్పారు. ఈ ఓట్లు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికలకు ముందు నుంచి నమోదు అయి ఉన్నాయని, అదే జాబితా ఇప్పుడు వార్డుల వారీగా విభజన చేశామన్నారు. డబుల్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్ల తొలగింపునకు కూడా ఇంటింటి పరిశీలన సమయంలో తొలగించబడతాయని స్పష్టం చేశారు

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

శంకర్‌పల్లి: రాష్ట్రంలోని అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. శనివారం మండలంలోని మహాలింగాపురంలో అంగన్‌వాడీలతో సమావేశం నిర్వహించగా.. ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శంకర్‌పల్లి సెక్టార్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా రాధ, ఉపాధ్యాయురాలిగా షఫీనా బేగం, కార్యదర్శిగా యాదమ్మ, కోశాధికారిగా మంగమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు పని భారం తగ్గించాలని కోరారు. అదేవిధంగా ప్రీప్రైమరీ పాఠశాలల నిర్వహణ బాధ్యతను అంగన్‌వాడీలకు అప్పగించాలన్నారు.

రైతులకు యూరియా పంపిణీ

కొందుర్గు: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కార్యాలయంలో శనివారం పోలీస్ పహారా మధ్య రైతులకు యూరియా పంపిణీ చేశారు. 225 మంది రైతులకు 450 బస్తాల యూరియా పంపిణీ చేశామని పీఏసీఎస్ సీఈఓ మహమూద్ షరీఫ్ తెలిపారు. కాగా ఇప్పటివరకు కొందుర్గు మండలంలో 14 వేల మంది రైతులకు 1,184 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, ఇంకా 500 మెట్రిక్ టన్నుల స్టాక్ ఏఓ సురేశ్‌రెడ్డి తెలిపారు. అదేవిధంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో 13 వేల మంది రైతులకు గాను 1,185 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, ఇంకా 400 మెట్రిక్ టన్నుల స్టాక్ అవసరమని ఏఓ రాజేందర్‌రెడ్డి తెలిపారు.

ఆలయానికి ఆదాయం సమకూర్చడమే లక్ష్యం

కొందుర్గు: దేవాలయానికి ఆదాయం సమకూర్చడం కోసమే స్థలాన్ని అద్దెకు ఇచ్చామని ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం కొందుర్గు శ్రీలక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ ప్రాంగణంలో కమిటీ చైర్మన్ కృష్ణయ్య ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేవాలయ స్థలం గ్రామస్తులకు అద్దెకు ఇవ్వడానికి సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. దుకాణాల ఏర్పాటుకు చిరువ్యాపారులకు అద్దెకు ఇచ్చామని, నెలకు రూ.14,400ల ఆదాయం సమకూరుతుందన్నారు.

పారిశుద్ధ్య సిబ్బంది సేవలు వెలకట్టలేనివి

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



మున్సిపల్ సిబ్బందితో చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: గ్రామాల పరిశుభ్రత, స్వచ్ఛదనం కోసం సిబ్బంది చేస్తున్న సేవలు వెలకట్టలేనివని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఆమె శనివారం సిబ్బందికి పీపీఈ కిట్లను అందజేశారు. అంతేకాకుండా కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి టేబుల్స్, కుర్చీలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వ్యాపారులు, ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణలో సిబ్బందికి సహకరించాలని కోరారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో చెత్తను వేయొద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో అంతర్గతరోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు వివరించారు. నిధుల లభ్యతను బట్టి విడతల వారీగా మిగిలిన వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు, నాయకులు దేవేందర్‌యాదవ్, గోపాల్‌గౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను తొలగించండి

ఎంపీడీఓకు మోదళ్లగూడ గ్రామస్తుల వినతి



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

నందిగామ: స్థానికంగా ఇళ్లు లేనివారు, గ్రామంలో నివాసం లేని వారిపేర్లు ఓటరు లీస్టులో ఉన్నాయని, అలాంటి బోగస్ ఓట్లను తొలగించాలని కోరుతూ మోదళ్లగూడ గ్రామస్తులు శనివారం ఎంపీడీఓ సుమతికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండల పరిధిలోని మోదళ్లగూడలోని పోలింగ్ స్టేషన్ల నం.57, 58లలో సుమారు 250కి పైగా బోగస్ ఓట్లు ఉన్నాయని, ఈ విషయమై విచారణ జరిపి తొలగించాలని గతంలో మండలస్థాయి నుంచి రాష్ట్రస్థాయి అధికారులతో పాటు ఎలక్షన్ కమిషన్‌కు సైతం ఫిర్యాదు చేసినా కూడా ఎలాంటి ఫలితం లేదని ఆరోపించారు. ప్రజాస్వామ్యబద్ధంగా జరగాల్సిన ఎన్నికలలో బోగస్ ఓట్లు ఉండటంతో గందరగోళం జరిగే అవకాశం ఉందన్నారు. గ్రామానికి ఎలాంటి సంబంధం లేనివారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రిన్సిపల్ దాడి చేశాడని పీడీ ఫిర్యాదు

కొత్తూరు: ఇన్ముల్‌నర్వ ఎస్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ భూక్యా బాలాజీ తనపై దాడి చేశారని ఫిజికల్ డైరెక్టర్ రాజు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయమై తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో శనివారం మీడియా ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. హాస్టల్‌కు కేటాయించిన బియ్యం కోటాలో ఇటీవల పది క్వింటాళ్ల బియ్యాన్ని ప్రిన్సిపల్ పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఈ విషయాన్ని తానే ఉన్నతాధికారులకు చేరవేసినట్లు అనుమానించిన ఆయన ఈనెల 28న విద్యార్థుల ముందే తనను నెట్టేసి అవమానపర్చాడన్నారు. అనంతరం హాస్టల్ వెనకాలకు తీసుకెళ్లి కాలితో తన్నాడని తెలిపారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయని పేర్కొన్నారు. తాను ఈనె 29న పోలీసులకు ఫిర్యాదు చేశానని స్పష్టంచేశారు. ఈ విషయమై కొత్తూరు సీఐ నర్సింహ్మారావును వివరణ కోరగా పీడీ ఫిర్యాదు చేసిన మాట వాస్తవమేనని, దీనిపై ప్రాథమిక విచారణ జరుపుతున్నామని తెలిపారు. ప్రిన్సిపల్ బాలాజీను వివరణ కోరగా తాను పీడీపై దాడికి పాల్పడలేదని, బియ్యం అక్రమాలతో తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఎంపీడీఓ హిమబిందు
- వివిధ పార్టీల నాయకులతో సమావేశం



చేవెళ్ల: రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ హిమబిందు

చేవెళ్ల: రాబోయే పంచాయతీ ఎన్నికలను సజావుగా నిర్వహించుకునేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకారం అందించాలని ఎంపీడీఓ హిమబిందు కోరారు. ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ముసాయిదా పంచాయతీ వార్డుల విభజన, ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్లపై నాయకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలంలోని పంచాయతీల వారీగా ముసాయిదా పోలింగ్ స్టేషన్లు, ముసాయిదా ఓటరు జాబితాను వార్డుల వారీగా విడుదల చేసినట్లు తెలిపారు. వీటి అధారంగా ఎన్నికలు నిర్వహించనున్నామని, అభ్యంతరాలు ఉంటే వాటిని ఉన్నతాధికారులు పరిశీలన చేస్తారన్నారు. పలువురు నాయకులు ఓటరు జాబితాలో తప్పుల నమోదుపై చర్చించారు. వార్డుల వారీగా కొంతమంది ఓట్లు వేరే చోట ఉన్నాయని వాటిని మార్చాలని తెలిపారు. నాంచేరిలో కాకుండా ఇంద్రారెడ్డినగర్‌లోనే పోలింగ్ స్టేషన్ ఉండాలని అ గ్రామ నాయకులు కొందరు కోరారు. నాంచేరి, ఇంద్రారెడ్డినగర్, కిష్టాపూర్ మూడు కలిపి పోలింగ్ స్టేషన్‌పై ఆలోచన చేస్తామని అధికారులు తెలిపారు. ముడిమ్యాలలో బోగస్ ఓట్లను తొలగించాలని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఎస్ఐలు సంతోష్‌కుమార్‌రెడ్డి, తేజశ్రీ, పలు రాజకీయ పార్టీల నాయకులు పెంటయ్యగౌడ్, పి.ప్రభాకర్, అమరేందర్‌గౌడ్, శ్రీధర్‌రెడ్డి, నరేందర్, నరహరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సహకరించాలి

కొందుర్గు: రానున్న గ్రామ పంచాయతీ ఎన్నికల దృష్ట్యా రూపొందించిన ముసాయిదా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని కొందుర్గు, జిల్లేడ్‌చౌదరిగూడ ఎంపీడీఓలు లక్ష్మీఅనురాధ, ప్రవీణ్‌కుమార్ కోరారు. శనివారం రెండు మండలాల్లో ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో రాజకీయ నాయకులతో వారు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికలకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓలు విజయ్‌కుమార్‌పాల్, హన్మంతురెడ్డి, సూపరింటెండెంట్ గణపతి, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

షాబాద్: ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీఓ అపర్ణ పేర్కొన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ముసాయిదా ఓటరు జాబితాపై అన్ని రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 2వ తేదీన తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల మండల అధ్యక్షులు నర్సింగ్‌రావు, చంద్రశేఖర్, మానయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

తప్పులను సవరిస్తాం

మొయినాబాద్ రూరల్: ఓటరు జాబితాలో ఏమైనా తప్పులు, అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఎంపీడీఓ కోరారు. ఈ సందర్భంగా ఆమె శనివారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఓటరు డ్రాఫ్ట్ లిస్టులో ఏమైనా అభ్యంతరాలు ఉన్నాయా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని ప్రతి గ్రామంలో 100 నుంచి 250 వరకు మరణించిన వారి ఓట్లు ఉన్నాయని, గ్రామాల్లో ఒకే ఇంట్లో ఉంటున్న భార్యాభర్తల ఓట్లు వేరు వేరు వార్డులలో నమోదు చేయడం ఏమిటన్నారు. ఇప్పటికైనా ఓటరు లిస్టులను సరిచేసి, మరణించిన వారి పేర్లను తొలగించాలని అధికారులకు విన్నవించారు. సమావేశంలో తహసీల్దార్ గౌతమ్‌కుమార్, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌రూరల్: అభ్యంతరాలను స్వీకరిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్

ఓటరు లిస్టు సవరణపై సమావేశం

కేశంపేట: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ కిష్టయ్య ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో శనివారం ఓటరు లిస్టు సవరణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిష్టయ్య మాట్లాడుతూ.. గ్రామ పంచాయితీ ముసాయిదా ఓటరు జాబితాలో చోటు చేసుకున్న తప్పులను సరిచేసేందుకు అభ్యంతరాలు తెలియజేయాలన్నారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే దరఖాస్తులను అందజేయాలని సూచించారు. సమావేశంలో వివిధ పార్టీ నాయకులు నర్సింహాయాదవ్, మురళీధర్‌రెడ్డి, రాధిక, మహేశ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తప్పులను సరిచేసేందుకు చర్యలు

షాద్‌నగర్‌రూరల్: ఓటరు జాబితాలోని తప్పులను సరిచేసేందుకు తగు చర్యలను తీసుకుంటామని ఎంపీడీఓ బన్సీలాల్ అన్నారు. ఓటరు లిస్టులోని అభ్యంతరాలపై దరఖాస్తులను స్వీకరించేందుకు శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన వివిధ పార్టీలకు చెందిన నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు ఓటరు జాబితాలోని తప్పులను సవరించాలని కోరుతూ.. ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. శాసనసభ, పార్లమెంట్‌లో ఎన్నికల్లో ఓటు వేసిన వారి పేర్లు ప్రస్తుత ఓటరు లిస్టులో గల్లంతయ్యాయని తెలిపారు. తప్పులపై అభ్యంతరాలను తెలియచేసేందుకు గడువు పెంచాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఓటరు లిస్టులో ఉన్న తప్పులపై వచ్చిన అభ్యంతరాలను స్వీకరించి.. సరిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మరణించిన ఓటర్ల పేర్లు తొలగించలేదని, ఒకరికి రెండు ఓట్లు ఉన్నాయని, అభ్యంతరాలకు మరింత సమయం కావాలని వచ్చిన వినతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. తప్పులను సరిచేసిన తర్వాత సెప్టెంబర్ 2న తుది ఓటరు జాబితాను అన్ని గ్రామ పంచాయతీలలో ప్రదర్శిస్తామన్నారు. సమావేశంలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, లక్ష్మణ్‌నాయక్, దొడ్డి శ్రీనివాస్, వెంకటేశ్‌యాదవ్, శ్రీనునాయక్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలపండి

శంకర్‌పల్లి: ఇటీవల గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శులు ప్రదర్శించిన ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ వెంకయ్య అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ఎప్పుడూ వచ్చిన సజావుగా నిర్వహించుకునేందుకు అన్ని పార్టీలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఇప్పటికే ప్రదర్శించిన ఓటరు జాబితా, పోలింగ్ బూత్‌లపై ఎటువంటి అభ్యంతరాలున్న సంబంధిత గ్రామ కార్యదర్శికి తెలియజేయాలని సూచించారు. వచ్చేనెల 2వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రదర్శించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీఓ గిరిరాజు, డిప్యూటీ తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, పలు పార్టీలకు చెందిన నాయకులు గోవర్ధన్‌రెడ్డి, బయానంద్, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.